క్లుప్తంగా

హోంగార్డుల ఐకమత్యం భేష్



రిటైర్డ్ హోంగార్డు బి. శ్రీనివాసులుకు చెక్కును అందచేస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప అర్బన్: జిల్లాలోని ప్రొద్దుటూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తూ ఇటీవల పదవీ విరమణ పొందిన హోం గార్డు బి. శ్రీనివాసులు (హెచ్.జి 81) కు తోటి హోం గార్డులు అండగా నిలిచారు. జిల్లాలోని హోం గార్డులు అందరూ ఒక రోజు వేతనం రూ. 4,11,090 సాయం చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం రూ. 4,11,090 చెక్కును జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్ చేతుల మీదుగా అందచేశారు. సాటి హోం గార్డు కు సాయం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన హోం గార్డ్స్ అందరినీ ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీశైల రెడ్డి పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఆపాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు స్మార్ట్ మీటర్ల బిగింపును తక్షణమే ఆపాలని సీపీఎం కడప నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని మృత్యుంజయకుంటలో స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలని స్టిక్కర్లను సీపీఎం నాయకులు ఇళ్లకు అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నేతలు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, స్మార్ట్ మీటర్లు బిగించబోమని ఇచ్చిన హామీ అమలుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. లోకేష్ పాదయాత్రలో స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని ఇచ్చిన పిలుపును మరిచిపోయారా అని ప్రశ్నించారు. కూటమి అధికారంలోకి లోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రజలపై రెండుసార్లు విద్యుత్ ఛార్జీల భారం మోపారని, ఇది దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బి దస్తగిరి రెడ్డి, కే శ్రీనివాసులు రెడ్డి, నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, కుమార్ స్వామి రెడ్డి, పి. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ వేణుగోపాల్‌కు రెడ్ క్రాస్ పురస్కారం



కడప కల్చరల్ : జిల్లాకు చెందిన డాక్టర్ దొండ్లవాగు వేణుగోపాల్‌కు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అత్యున్నత పురస్కారం ప్రకటించింది. మొత్తంపై 110 పర్యాయాలు వ్యక్తిగతంగా రక్తదానం చేసినందుకు చిట్వేలికి చెందిన డాక్టర్ దొండ్లవాగు వేణుగోపాల్‌కు ఈ అవార్డు లభించినట్లు ఆయన సోదరుడు దొండ్లవాగు శ్రీనివాసులు బుధవారం ప్రకటించారు. రాష్ట్ర గవర్నర్ అధ్యక్షులుగా ఉన్న ఈ సంస్థ ఈ నెల 14వ తేదీన ప్రపంచ రక్తదాతల దినోత్సవ సందర్భంగా గుంటూరులో జరిగే కార్యక్రమంలో పురస్కారం ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. సంస్థ సీఈఓ, ప్రధాన కార్యదర్శి ఎం.కే.ఫరీదా ద్వారా కడప జిల్లా రెడ్ క్రాస్ సంస్థకు ఈ మేరకు సమాచారం అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ అత్యున్నత పురస్కారం అందుకోవడం తనకు లభించిన గౌరవంగా భావిస్తున్నానన్నారు.

యోగాతో ఆరోగ్యం పదిలం



యోగాసనాలు సాధన చేస్తున్న విద్యార్థులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతి విద్యార్థి యోగాసనాలు చేయడం ద్వారా ఆరోగ్యం పదిలంగా ఉంచుకోవచ్చని యోగా గురువులు యోగేశ్వర్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వరి ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాంధ్రలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారన్నారు. యోగా చేయడం ద్వారా అనేక దీర్ఘకాలిక వ్యాధులను దూరం చేసుకోవచ్చని, ఆరోగ్యవంతంగా జీవించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు హబీబుల్లా, రాజారావు, శ్రీరాములు రెడ్డి, చంద్రమౌళి, లెక్చరర్ సుధాకర్‌రాజు, అమృతరాజు, సుజాత, పద్మావతి, రోజమ్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైభవంగా భీమేశ్వరస్వామి తిరునాల

పెండ్లిమర్రి : మండలంలోని వేలూరుపాడు గ్రామ సమీపంలో వెలసిన శ్రీభీమేశ్వరస్వామి తిరునాల రెండవ రోజు బుధవారం వైభవంగా జరిగింది. ఉదయం స్వామివారికి అభిషేకాలకరణ, పంచామృతాభిషేకం వంటి కార్యక్రమాలు వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం 9.50గంటల నుంచి 12 గంటల వరకు శివపార్వతుల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. భక్తులకు ఆలయ ఆవరణలో దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహించారు.



సాయిపేటలో చెత్త పేరుకు పోవడంతో దుర్గంధంతో ముక్కు మూసుకొని వెళుతున్న మహిళ



సంఘం ఫంక్షన్ హాల్ ఎదుట చెత్తతో పాటు మురికి నీరు



వర్షానికి బురదమయంగా మారిన పాలెంపల్లి మెయిన్ రోడ్డు

వీధులలో దుర్గంధం

కడప నగరంలోని పలు వీధులలో ఎక్కడి చెత్త అక్కడ పేరుకుపోతోంది. దుర్వాసన వస్తుండడంతో ఆ మార్గంలో వెళ్లేవారు ముక్కుమూసుకుని పోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇక కొన్ని వీధులలో అయితే కొద్దిపాటి వర్షానికే వీధులు జలమయం అవుతున్నాయి. ఆ వీధులలో వాహనదారులు వెళ్లాలంటే ఇక్కట్లు పడుతున్నారు. వీధులలో చెత్తను శుభ్రం చేయాలని.. వాన నీరు నిల్వ ఉండకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - ఫొటోలు: సాక్షిఫొటోగ్రాఫర్, కడప

పోస్టర్ల ఆవిష్కరణ



రక్తదాన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఈఓ షంషుద్దీన్ తదితరులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : రక్తదాన ప్రాధాన్యతను గుర్తించి ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్ పిలుపునిచ్చారు. జూన్ 14వ తేదీన రక్తదాతల దినోత్సవం సందర్భంగా బుధవారం రాయల్ రషీద్ అసోసియేషన్ అధ్యక్షుడు రాయల్ కరీముల్లా తయారు చేసిన రక్తదాన పోస్టర్లను డీఈఓ, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రూటా రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్, జిల్లా అధ్యక్షులు జాకీర్ హుస్సేన్, అఫ్జల్, ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అయ్యప్ప ప్రచార దీక్షకు ఏర్పాట్లు



సమావేశంలో చర్చిస్తున్న అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి ప్రతినిధులు

కడప కల్చరల్ : కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలోగల అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కడపజిల్లా శాఖలో భాగంగా కార్యక్రమ నిర్వాహకులు, ఆలయ ధర్మకర్త దేసు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో చర్చ నిర్వహిచారు. ఇందులో భాగంగా వెంకటరెడ్డితోపాటు సంస్థ జిల్లా అధ్యక్షులు దేవతి శంకరయ్య, నందారపు చెన్నకృష్ణారెడ్డి, ఇతర ధార్మిక వేత్తలు కార్యక్రమంపై చర్చ నిర్వహించారు. నిర్వాహకుల్లో ఒకరైన దేవతి శంకరయ్య కూడా ముమ్ముందు జరగాల్సిన జిల్లా స్థాయి కార్యక్రమాలు, తీసుకోవాల్సిన నిర్ణయాల గురించి చర్చించారు. కార్యక్రమానికి హాజరైన పలువురు భక్తులు కార్యక్రమాల గురించి ప్రత్యేకంగా సూచనలు, సలహాలు అందజేశారు.

అనుమతులు లేని విద్యాసంస్థలను సీజ్ చేయాలి

కడప అర్బన్ : జిల్లా వ్యాప్తంగా అనుమతులు లేకుండా నడుపుతున్న శ్రీ చైతన్య, నారాయణ విద్యాసంస్థలను సీజ్ చేయాలని ఏఐఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్ డిమాండ్ చేశారు. అఖిల భారత విద్యార్థి సంఘం కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీ చైతన్య, నారాయణ విద్యాసంస్థలలో విద్యార్థులకు రకరకాల గ్రూపులు ఏర్పాటు చేసుకొని లక్షల రూపాయలు ఫీజులు పేద మధ్యతరగతి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి దండుకుంటున్నారని పేర్కొన్నారు. విద్యాసంస్థల పేరుతో ముద్రించిన పుస్తకాలు అమ్మకూడదని నిబంధన ఉన్నప్పటికీ తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి వేల రూపాయలు దండుకుంటున్నారని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించకపోతే డీఈఓ కార్యాలయం ముట్టడికి పిలుపునిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలి



రవాణాశాఖ ఏఓ ప్రకాష్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రోగ్రెస్ స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : తల్లిదండ్రులకు భారంగా మారిన ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న డిమాండ్ చేశారు. బుధవారం కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీ అడ్డుకట్ట వేయాలని పాఠశాల ప్రాంతీయ సంయుక్త సంచాలకుల కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ జిల్లాల పరిధిలో ఉన్న కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మోసం చేస్తూ అడ్మిషన్ల పేరుతో దోపిడీకి గురి చేస్తున్నాయన్నారు. పలు కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలలు గుర్తింపు లేకుండా కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు మహేష్, ముబారక్ బాషా, రమణ, శ్రీనివాసులు రెడ్డి, సాయి, రవీంద్ర, వెంకటేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కడప, ప్రొద్దుటూరు ఎంఈఓలను సస్పెండ్ చేయాలి



డీఆర్వోకు వినతిపత్రం సమర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ బదిలీలలో ప్రిఫరెన్షియల్ కేటగిరిలో కేటాయించవలసిన స్థానాల కంటే అధికంగా కేటాయించి, బదిలీల చట్టం–2025ను ఉల్లంఘించి ఇష్టారాజ్యంగా వ్యవహరించిన కడప, ప్రొద్దుటూరు మండల విద్యాశాఖాధికారులు గంగిరెడ్డి, సావిత్రమ్మలను సస్పెండ్ చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబులు డిమాండ్ చేశారు. బుధవారం కడపలోని స్కౌట్ హాలులో విద్యాశాఖ నిర్వహిస్తున్న బదిలీల్లో ఎంఈఓలు వ్యవహరించిన తీరు వల్ల ఉపాధ్యాయులకు జరిగిన తీవ్ర నష్టాన్ని వివరిస్తూ కలెక్టరేట్‌లో జిల్లా రెవిన్యూ అధికారి ఎం.విశ్వేశ్వర నాయుడుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళవారం చేపట్టిన మాన్యువల్ కౌన్సిలింగ్‌లో కడప, ప్రొద్దుటూరు మండలాల పరిధిలో నిబంధనల కంటే ఎక్కువ పోస్టులను ప్రిఫరెన్షియల్ కేటగిరీలో చూపించి జనరల్ కేటగిరిలో ఉన్నవారికి తీవ్ర అన్యాయం చేశారన్నారు. మండల విద్యాశాఖాధికారుల నిర్లక్ష్యం వల్ల దాదాపు పదిమంది జనరల్ కేటగిరి ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతోపాటు అర్ధరాత్రి 1.30 గంటల వరకు కౌన్సిలింగ్ ప్రక్రియ నిలిచిపోయి ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులతో పాటు ఒత్తిడికి గురయ్యారన్నారు. అధికారులు జరిగిన తప్పును గుర్తించి, కౌన్సిలింగ్ ను రద్దుచేసి తిరిగి కౌన్సిలింగ్ నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, తప్పును సరి చేయకుండా అర్ధ రాత్రి తర్వాత బదిలీల ప్రక్రియను కొనసాగించడం వల్ల ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన కడప, ప్రొద్దుటూరు మండల విద్యాశాఖాధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు నష్టపోయిన ఉపాధ్యాయులకు తగు న్యాయం చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు సీవీ రమణ, ఎస్.ఎజాస్ అహ్మద్‌లు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని విద్యా సంస్థల బస్సులపై చర్యలు తీసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : విద్యార్థులను తరలించే బస్సుల్లో పలు బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు లేవని, అలాంటి బస్సుల కారణంగా ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందని ప్రోగ్రెస్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొడవటికంటి నాగరాజు కోరారు. ఈ మేరకు బుధవారం ఉప రవాణా శాఖ పరిపాలన అధికారి ఇ.వై.ప్రకాష్ కు వినతి పత్రం అందజేశారు. నాగరాజు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు సంబంధించి కాలం చెల్లిన బస్సులు, ఫిట్‌నెస్ లేకుండా బస్సులను తిప్పుతున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న విద్యా సంస్థల బస్సులను తనిఖీలు నిర్వహించి అటువంటి బస్సులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. అలాగే కొన్ని పాఠశాలలలో 60 సంవత్సరాలకు పైబడిన వ్యక్తులను బస్సు డ్రైవర్లుగా నియమించుకున్నారన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకునేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా నాయకులు సుభాన్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గాలయంలో పౌర్ణమి పూజలు



హోమం నిర్వహిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో బుధవారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా బుధవారం పౌర్ణమిని పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచి పవిత్ర నదీ జలాలు నింపిన తొమ్మిది పవిత్ర కలశాలతో అమ్మవారికి నవకలశ స్నపనం నిర్వహించారు. ఆలయంలోని అమ్మవారి సన్నిధిలో వేదమంత్రోచ్ఛాటనలతో మంగళ వాయిద్యాల నడుమ ఉభయదారులు అమ్మవారి సన్నిధికి చేరుకున్నారు. ఇందులో ఉభయదారులు తొమ్మిది పవిత్ర కలశాలను చేతబూని ఉభయదారులుగా కార్యక్రమంలో పాల్గొన్నారు. అమ్మవారి చుట్టూ మూడు ప్రదక్షిణలు నిర్వహించి ఆ కలశాలను అర్చకులకు అందజేశారు. అనంతరం వారు ఆ పవిత్ర జలాలతో అమ్మవారికి నవకలశ స్నపనం చేసినంతరం ఉదయం 10.00 గంటలకు ఆలయ యాగ మండపంలో చండీహోమాన్ని భక్తులచే చేయించారు. పౌర్ణమి రోజు కావడంతో సాయంత్రం 6.30 గంటలకు అమ్మవారికి 108 మంది ముత్తయిదువులచే అదే సంఖ్యలోని దీపాలతో అష్టోత్తర శతదీపాలంకార సేవను నిర్వహించారు. రాత్రి 8 గంటలకు అమ్మవారి సన్నిధిలో పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, ఆలయ వ్యవస్థాపకులు దుర్గాప్రసాద్ కార్యక్రమాలను పర్యవేక్షించి హాజరైన భక్తులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రాజేశ్వరీమాత సన్నిధిలో గోమాతకు పూజలు



గోపూజలో పాల్గొన్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయంలో బుధవారం అమ్మవారికి విశేషంగా జేష్ఠ ఏరువాక పౌర్ణమిని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలోని అమ్మవారి సన్నిధిలో ఈ సందర్భంగా సనాతన ధర్మ సంస్కృతికి సంబంధించి శిక్షణ పొందుతున్న విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు పిడతల గోపాలకృష్ణమూర్తి తొలుత ఆలయంలో నిర్వాహకులు, బాలలచే ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. అనంతరం పెద్దలతో కలిసి గోమాత విశిష్టత గురించి తెలియజేశారు. హిందువులకు ఎంతో పవిత్రమైన గోమాతను పూజించడం, స్మరించడం ఎంతో విలక్షణమైనదని ఆయన వివరించారు. గోపూజ నిర్వహించిన సత్సంగ అధ్యక్షులు కాకనూరు సుబ్బారెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రత్యేక పూజలతో నిర్వహింపజేశారు. శ్రీ జ్ఞాన సరస్వతి వెంపల అన్నాజీ, కార్యదర్శి భార్గవ, ఆలయ ఈఓ శ్రీధర్‌లు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను ప్రోత్సహించారు.

వైఎస్ జగన్‌కు వస్తున్న ప్రజాదరణను ఓర్వలేక కుట్రలు

కడప కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక అధికార పార్టీ నేతలు నీచ రాజకీయాలు చేస్తున్నారని ఆర్టీసీ మాజీ జోనల్ ఛైర్మెన్ రెడ్యం వెంకట సుబ్బారెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రకాశం జిల్లా పొదిలిలో రైతుల సమస్యలు తెలుసుకునేందుకు వైఎస్ జగన్ పర్యటిస్తుంటే వీధులన్నీ జనంతో కిక్కిరిసిపోయాయన్నారు. దీన్ని జీర్ణించుకోలేని అల్లరిమూకలు చెప్పులు వేయడం పిరికిపంద చర్య అన్నారు. వైఎస్ జగన్ ఎక్కడికి వెళ్లినా జనం ఒక ప్రభంజనంలా వస్తుండటంతో సీఎం చంద్రబాబుకు దిక్కుతోచడం లేదన్నారు. సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు అమరావతి మహిళలపై ఎలాంటి వ్యాఖ్యలు చేయకపోయినా ఆయన్ను బాధ్యున్ని చేసి అరెస్ట్ చేయడం ఆక్షేపణీయమన్నారు.